చక్రం తిప్పుతున్న
ఫీడ్ మాఫియా

- కుదేలవుతున్న ఆక్వా రైతులు
- క్రాప్ హాలిడే వైపు అడుగులు?



ఆక్వా రంగాన్ని ఫీడ్ మాఫియా పట్టి పీడిస్తోంది. అధికార పార్టీ అండతో రొయ్యల ధరలను తమ గుప్పెట్లో ఉంచుకుని ఆక్వా రైతులను నిలువు దోపిడీ చేస్తోంది. విదేశీ మార్కెట్లో అధిక ధరలుండీ.. కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని అడిగే ధైర్యం లేక.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని రైతులు క్రాప్ హాలిడేవైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. - కోట


విదేశాలకు ఎగుమతి చేయడానికి ఓ బడా కంపెనీ సిద్ధం చేసిన రొయ్య పప్పు

మన దేశంలో డాలర్లు పండించేది ఆక్వా రంగమేనని ఒక పక్క చెబుతున్నా..మరో పక్క రొయ్య రైతుల కష్టాలు మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. సీడ్ (రొయ్య పిల్ల), ఫీడ్ (రొయ్యల మేతలు), విద్యుత్ చార్జీలు పెరిగిపోతున్నా మంచి ధర వస్తే చాలని సాగు చేస్తుంటే ఫీడ్ మాఫియా దెబ్బకు రైతులు మరింత కుదేలవుతున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా 10 ఫీడ్(రొయ్యల మేతలు) కంపెనీలు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 78 రొయ్యల హేచరీలకు, రైతులకు ఫీడ్‌ను వాయిదా పద్ధతులపై అప్పుగా సరఫరా చేస్తాయి. పంట వచ్చాక రొయ్యలను ఫీడ్ సరఫరా చేసిన కంపెనీలే కొనుగోలు చేస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. రైతుల వద్ద ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు ఫీడ్ మాఫియా రంగంలోకి దిగుతుంది. విదేశీ మార్కెట్‌లో ధరలు పడిపోయాయంటూ బయ్యర్ల ద్వారా ప్రచారం చేయిస్తుంది.ప్రశ్నించే ధైర్యం లేక రైతులు కూడా వారు చెప్పినట్లే కారు చౌకగా రొయ్యలను ఫీడ్ కంపెనీలకు అప్పజెప్పాల్సి వస్తోంది.

ప్రస్తుతం ఆశాజనకంగా ధరలు

చైనా, యూరప్, అమెరికా దేశాల్లో ప్రస్తుతం రొయ్యల ధరలు ఆశాజనకంగా ఉన్నాయని సమాచారం. అయితే ఇక్కడ మాత్రం ఆ దిశగా కొనుగోళ్లు జరగడం లేదు. వాస్తవానికి వెనామీ రొయ్య ధర 100 కౌంట్ రూ.300-310 పలుకుతుండగా,ప్రస్తుతం రైతుల నుంచి రూ.210 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. తర్వాత శుద్ధి చేసిన రొయ్య పప్పును విదేశాల్లో కిలో 700 నుంచి 800 రూపాయల వరకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

మద్దతు ధర కల్పించాలి

వరి మిగతా పంటలవలే రొయ్యలకు మద్దతు ధర కల్పించాలి. ప్రధానంగా మాఫియా బారి నుంచి రైతులను రక్షించాలి. కుదేలైన ఆక్వా రంగానికి జీవం పోయాలి.



- పల్లెమల్లు విజయసారథి రెడ్డి,
ఆక్వా రైతు, విద్యానగర్, కోట మండలం

అంబేడ్కర్ జయంతి వేడుకలను చిట్టమూరు మండలం సోమసముద్రం గ్రామంలో వైభవంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం తయారు చేయించి,పుష్పాలతో అలంకరించి చిట్టమూరు నుంచి కొత్తగుంట వరకు ఊరేగించారు.



అంబేడ్కర్ గ్రామోత్సవం

రూ.4.7కోట్ల బంగారం, 27 లక్షల వెండి పట్టివేత

చిల్లకూరు, ఏప్రిల్ 14: బిల్లుల్లేకుండా తరలిస్తున్న బంగారం, వెండి ఆభరణాలను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద వున్న చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా నెల్లూరు నుంచి మదనపల్లెకు తరలిస్తున్న జీఆర్‌టీ జ్యువెలరీకి చెందిన బంగారం, వెండిని పరిశీలించామన్నారు. ధృవీకర ణపత్రాలు లేకపోవడంతో రూ.4,79,16,247 విలువచేసే 6,986 గ్రాముల బంగారం, రూ. 27,91,879 విలువ చేసే 23,688 గ్రాముల వెండిని సీజ్ చేసి ఆదాయపన్నుశాఖకు అప్పగించామన్నారు.

డెంగీతో బాలిక మృతి


సౌమశ్రీ(పాతచిత్రం)

వరదయ్యపాళెం, ఏప్రిల్ 14:వరదయ్యపాళెం పంచాయతీ వడ్డిపాళేనికి చెందిన ఓ బాలిక డెంగీ జ్వరం తో కన్నుమూసింది. టీడీపీ నాయకుడు బెల్లంకొండ శేఖర్ కుమార్తె అయిన సౌమ్యశ్రీ(15) కొద్దిరోజులుగా డెంగీతో బాధపడుతోంది. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో శనివారం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సౌమ్యశ్రీ చనిపోయింది.

ఏడుగురు ఉద్యోగుల సస్పెన్షన్

- సీజ్ చేసిన రూ.35.58లక్షల విడుదల
- 23మంది వలంటీర్ల తొలగింపు:కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 14:ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ క్రీమెన్ కమిటీ ద్వారా 23కేసుల్లో రూ.42.68లక్షల నగదును సీజ్ చేశామని తెలిపారు. అయితే ఈ కేసులన్నింటినీ సమీక్షించి 20 కేసులకు సంబంధించి 35.58లక్షలు సంబంధీకులకు అందజేశామన్నారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 23మంది వలంటీర్లను తొలగించినట్లు తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఏడుగురిని సస్పెండ్ చేశామన్నారు. ఒకరిపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేయగా మరొకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించి ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

వసూల్ రాజా....
జబర్దస్త్ దోపిడీ

శ్రీకాళహస్తి,నగరి ఎమ్మెల్యేలపై షర్మిల ఫైర్



శ్రీకాళహస్తి సభలో మాట్లాడుతున్న షర్మిల


పుత్తూరు సభలో కాంగ్రెస్ నేతలతో షర్మిల

శ్రీకాళహస్తి/సత్యవేడు/పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 14 : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నగరి ఎమ్మెల్యే రోజాలపై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఫైర్ అయ్యారు. ఆదివారం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు పట్టణాల్లో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేలపై తీవ్రస్థాయి ఆరోపణలతో విరుచుకుపడ్డారు. శ్రీకాళహస్తి సభలో మాట్లాడుతూ... ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి మీకు ఎప్పుడైనా పనికొచ్చాడా? ఏనాడైనా పనులు చేసిపెడుతున్నాడా? అని ప్రశ్నించారు.మీ ఎమ్మెల్యే ఎలా ఉన్నాడని స్థానికులను అడిగితే వసూల్ రాజా అని చెప్తారన్నారు.మొత్తం చెరువులన్నీ దోచేసుకున్నాడట...ఇసుక, మట్టి మాఫియాగా తయారై చెరువులు కూడా ఖాళీ చేసేసాడంట కదా అని వ్యాఖ్యానించారు. కబ్జాల రాజా అంట... ఎక్కడ ఏ భూమి కాజేయాలనే వేటలో ఉంటాడట... ఆఖరికి పేదలకు ఇచ్చిన భూములను కూడా వదల్లేదట మీ ఎమ్మెల్యే అంటూ ఎద్దేవా చేశారు. ఎవరైనా ఎమ్మెల్యే ట్యాక్సు కట్టాల్సిందేనని, లేకుంటే ఏ పరిశ్రమనూ బతకనివ్వడట అని వ్యాఖ్యానించారు.ఈయన దెబ్బకు పరిశ్రమలు మూసుకుని వెళ్లిపోతున్నారట కదా అని ప్రశ్నించారు.ఓట్లు అడగడానికి ఎమ్మెల్యే మళ్ళీ వస్తాడని, డబ్బులు బాగా ఇస్తాడని, ఎంత ఇచ్చినా తీసుకోవాలని, అయితే ఓటు వేసేటప్పుడు మాత్రం ఒకసారి ఆలోచించి వేయాలని కోరారు. ఓటును అమ్ముకుంటే భవిష్యత్తును అమ్ముకున్నట్టేనని, ఆలోచన లేకుండా ఓటు వేస్తే పిల్లలను వారికి బానిసలుగా మార్చినట్టేనని హెచ్చరించారు. శ్రీకాళహస్తిలో అభివృద్ధి జరగాలంటే ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ నాయుడిని, ఎంపీ అభ్యర్థి చింతా మోహన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ ,సీపీఎం నాయకులు జనమాల గురవయ్య, పుల్లయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి పుత్తూరు కేవీఎన్ రోడ్డులోని కాపు వీధి సర్కిల్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ నగరి నియోజకవర్గానికి నలుగురు మంత్రులని జనం చెబుతున్నారన్నారు. రోజా భర్త, ఆమె ఇద్దరు అన్నలు కూడా మంత్రులేనన్నారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక, మట్టి మాఫియా నడిపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. నగరి నియోజకవర్గానికి రోజా ఎన్నో హామీలిచ్చారని ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఒక్క రోజు కూడా నియోజకవర్గం కోసం పనిచేయలేదన్నారు. మళ్ళీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమేనని, డబ్బులు కూడా ఇస్తారంట అని వ్యాఖ్యానించారు. ఎంత డబ్బు ఇచ్చినా తీసుకోవాలని, అవన్నీ ఇసుక, మట్టి మాఫియా నుంచీ దోచుకున్న డబ్బులేనన్నారు. కానీ ఓటు వేసే ముందు ఆలోచించాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే 30 ఏళ్లు సేవ చేస్తానని వాగ్దానం చేశారు.సీపీఐ,సీపీఎం నాయకులు రామానాయుడు,గంగరాజు,డీసీసీ అధ్యక్షుడు భాస్కర్, జగపతి తదితరులు ప్రసంగించారు.సత్యవేడు సభలో షర్మిల మాట్లాడుతూ ఈ నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారట అంటూ వ్యాఖ్యానించారు. అసలు ఎమ్మెల్యే ఉన్నాడా లేడా... కోనేటి ఆదిమూలం కొడుకు షాడో ఎమ్మెల్యే అంట కదా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలగురవం బాబును, ఎంపీ అభ్యర్థి చింతా మోహన్‌ను గెలిపించాలని కోరారు.


బాహాబాహీకి దిగిన ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు


శేఖర్ రెడ్డిని పక్కకు తీసుకెళ్తున్న ఎస్ఐ రహీం రెడ్డి


మున్సిపల్ చైర్మన శ్రీమంతరెడ్డిని తీసుకెళ్తున్న అనుచరులు

వైసీపీ ప్రచారంలో
బాహాబాహీ

తొలిరోజు ప్రచారంలోనే వర్గవిభేదాలు బట్టబయలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 14 : ఎన్నికల ప్రచారం సాక్షిగా సూళ్లూరుపేట వైసీపీలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాలు బాహాబాహీకి దిగాయి. దీంతో గంటపాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదట బస్టాండు వద్ద గాంధీబొమ్మ నుంచి ప్రారంభించి బజారు ప్రధాన వీధుల్లో ఆర్భాటంగా ప్రచారం నిర్వహించారు.పీర్లచావడి వద్దకు చేరుకొనే మార్గంలో రెండు వర్గాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.మున్సిపాలిటీ రోడ్డు సమీపంలో అరుణ్ ఐస్‌క్రీమ్ వద్ద వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (స్వామిరెడ్డి) ఉండగా ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి వర్గీయులు అక్కడకు చేరుకొని గొడవకు దిగారు. మాటామాట పెరిగి తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకొన్నాయి.తోపులాటలు, అరుపులతో గందరగోళం నెలకొంది. అదే సమయంలో రాళ్లు కూడా రువ్వినట్లు శేఖర్ రెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇరు వర్గాల నడుమ తోపులాటలు చోటు చేసుకోవడం ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. పీర్లచావడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు రెండు వర్గాలూ తోపులాడుకున్నాయి.సీఐ మధుబాబు, ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు చేరుకొని సర్దిచెప్పి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ముందు ప్రచార రథంలో ఉన్న ఎమ్మెల్యే సంజీవయ్య, ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి ఈ విషయాన్ని తెలుసుకొని ప్రచారాన్ని నిలిపివేసి శేఖర్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డిలకు నచ్చజెప్పి ప్రచార రథాన్ని గాండ్ల వీధి వైపు తీసుకెళ్లారు. అనంతరం అందరూ మున్సిపాలిటీ కార్యాలయం వెనుక వైపునకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నాలు చేశారు. కాగా ప్రచారంలో వైసీపీ నాయకుల అత్యుత్సాహంపై విమర్శలొచ్చాయి. భారీ ర్యాలీ, డీజే సౌండ్‌లతో కార్యకర్తలు చిందులు వేస్తూ బజారు వీధుల్లో రాత్రి 8 గంటల వరకు హంగామా సృష్టించారు. దీంతో బాపూజీ వీధి, వినాయకుడి గుడి సెంటర్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

మా గ్రామంలోకి రావొద్దు
వైసీపీ అభ్యర్థిని అడ్డుకున్న కళత్తూరు దళితులు


ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ కారును అడ్డగిస్తున్న కళత్తూరు దళితులు

కేవీబీపురం, ఏప్రిల్ 14 : ఎన్నికల ప్రచారంలో సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆదివారం ఉదయం ఆదవరం, వేమలపూడి, ఎస్ఎల్‌పురం గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసుకుని కళత్తూరుకు వెళుతుండగా కళత్తూరు దళితవాడకు చెందిన వైసీపీ నాయకులు రాజేష్ కారును అడ్డగించారు.తమ గ్రామానికి వైసీపీ ప్రభుత్వంలో ఏం మేలు చేశారని ఓట్లడగడానికి వస్తున్నారని ప్రశ్నించా రు.పెద్దఎత్తున నినాదాలు చేస్తూ గోబ్యాక్ గోబ్యాక్ అంటూ గ్రామస్థులు అరవడం మొదలుపెట్టారు.ఎంపీపీ భర్త నందకుమార్‌ను,మండల వైసీపీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్యను దుర్భాషలాడారు. గ్రామంలోకి రానివ్వండి... మాట్లాడుకుందామని రాజేష్ నచ్చజెప్పినా ప్రజలు వినలేదు.స్థానిక నాయకులపై ఉన్న కక్షతో కొందరు గ్రామస్థులు ఎమ్మెల్యే అభ్యర్థిని రానివ్వలేదని సమాచారం. ఒక వర్గం వారు రావాలని, మరో వర్గం వారు వద్దని నినాదాలు చేస్తూ గొడవ సృష్టించారు.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలనూ చెదరగొట్టారు.దీంతో వచ్చిన దారినే ఎమ్మెల్యే అభ్యర్థి, నాయకులు వెనుదిరగాల్సివచ్చింది.నిజానికి పెరిందేశం గ్రామంనుంచీ ఎన్నికల ప్రచారం ప్రారంభించాలనుకున్నారు. అయితే అక్కడి ప్రజలు అడ్డగిస్తారని ముందే తెలుసుకోవడంతో ఆదవరం నుంచీ ప్రచారాన్ని మొదలుపెట్టారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పాకాల, ఏప్రిల్ 14: స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 1994 ఏప్రిల్ 14న బొంబాయి షిప్ యార్డ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళులు అర్పించారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాలలో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామని అగ్నిమాపక అధికారి గుణశేఖర్ రెడ్డి చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లేక వలసపోతున్న యువత



ఇంటింటి ప్రచారంలో పులివర్తి వినీల్

తిరుచానూరు, ఏప్రిల్ 14: నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య వేధిస్తోందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ అన్నారు. ఆదివారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధికి యువత పక్క రాష్ట్రాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

చంద్రగిరి, ఏప్రిల్ 14: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రామచంద్రాపురం మండలం, అనుప్పల్లి పంచాయతీ, బొప్పరాజుపల్లెకు చెందిన అప్పన లోకేశ్వరి, కుమారరాజా దంపతులు ఆదివాకం రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి పుట్టా రామకృష్ణారెడ్డి, పూజారి సూరిస్వామిలకు అందజేశారు. జీడీ నెల్లూరు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బట్టే చాణిక్య ప్రతాప్, కారె చెంగల్రాయులు, కారె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు కాలినడకన తమిళ భక్తులు

తిరుచానూరు,ఏప్రిల్ 14: తమిళ నూతన సంవత్సరం సందర్భంగా తిరుమలకు కాలినడకన రెండు వేల మంది తమిళ భక్తులు తరలివెళ్లారు. కిల్పీ, ఆర్కే పేట, షోలింగర్ ప్రాంతాల నుంచి వీరు బుధవారం బయలుదేరారు. ఆదివారం ఉదయం రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కొంతసేపు భజనలు చేసిన అనంతరం తిరుమలకు బయలుదేరారు.

వాహనాల తనిఖీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 14: ఎన్నికల నేపథ్యంలో పచ్చికాపల్లం ప్రధానరహదారి వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేనివాటికి అపరాధం వేశారు. ఎస్ఐ చిరంజీవి పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రత్యుంజరహోమం



శక్తిపీఠంలో గోపూజ

రామచంద్రాపురం, ఏప్రిల్ 14: వసంత నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో ఆదివారం శాస్త్రోక్తంగా ప్రత్యుంజర హోమం నిర్వహించారు. మరకటకాళీ శక్తి అమ్మవారికి, రాధాకృష్ణులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేట్టారు. ఉదయం 9గంటలకు వేదపండితులు ప్రత్యుంజర హోమం ప్రారంభించగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధిశ్వరి రమ్యానంద భారతి స్వామి పూర్ణాహతి సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ అనంతరం భక్తులకు దేవీ వైభవాన్ని వివరించి అనుగ్రహ భాషణం చేశారు.

అంబేడ్కర్ పోరాటాలు స్ఫూర్తిదాయకం



పాకాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పులివర్తి నాని

పాకాల, ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం పాకాల మండలంలో ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి పార్టీ శ్రేణులతో ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, హక్కులకోసం ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని నాని కొనియాడారు. అంబేడ్కర్ భవనం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పన

చంద్రగిరి, ఏప్రిల్ 14: చంద్రగిరి మండలం, ఐతేపల్లిలో టీడీపీ సీనియర్ నేత ఏవీ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు యువత ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉద్యోగకల్పనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.అనంతరం నానితో పాటు నాయకులను సన్మానించారు.

వైసీపీకి ఏవీఎం శ్రీనివాసులు రాజీనామా

మంగళం, ఏప్రిల్ 14: తిరుమలనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమలనగర్ పరిరక్షణ సేవాసమితి అధ్యక్షుడు ఏవీఎం శ్రీనివాసులు వైసీపీ క్రియాశీలక సభ్యత్వానికి ఆదివారం రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడి హోదాలో కార్యదర్శి, పెద్దలను సంప్రదించి సేవాసమితిని కూడా రద్దు పరుస్తున్నట్లు ప్రకటించారు.

శాస్త్రీయ నృత్యం సమ్మోహనం



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, ఏప్రిల్ 14: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన నటరాజా డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన సమ్మోహనంగా సాగింది. మహాగణపతి, వినాయక కౌస్తుభం,కల్యాణ రామా, జగడపు జగముల, అదిలో అల్లదివో, వంటి పాటలకు కళాకారులు మనశ్రీ, లాలస్‌రాజ్, జశ్వంత్, రుత్విక, దీపిక, వర్షిక, రేషిక, వర్షుక, దీపిక, దివ్య, సుమిద ప్రదర్శించిన నృత్యం నగరవాసులను ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోదండరామస్వామివారి ఆలయంలో ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న అధికారులు

చంద్రగిరి, ఏప్రిల్ 14: చంద్రగిరిలోని కోదండ రామస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమజనం జరిగింది. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్నింటినీ నీటితో శుద్ధి చేశారు. సుగంధ ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ఆలయం సంప్రోక్షణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. కాగా కోదండరామాలయంలో ఈనెల 17 నుంచి 25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 16న అంకురార్పణ జరగనుంది. 17న ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం కోదండరామస్వామి హనుమంతు వాహనంపై దర్శనం ఇవ్వనున్నారు. 23వ తేదీ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.750 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. 26వ తేది ఉదయం శీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు



టీడీపీలో చేరిన వారితో పులివర్తి నాని తదితరులు

పాకాల, ఏప్రిల్ 14: పాకాల మండలం ఇరంగారిపల్లె వైసీపీ ఎంపీటీసీ పి.కస్తూరి తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇరంగారిపల్లెలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన పి.మోహన్, డి.వెంకటేశులు, డి.గోవిందు, డి.మురగయ్య, జగన్నాథం, యోగేష్ పార్టీలో చేరారు. చెన్నుగారిపల్లె పంచాయతీలో వైసీపీ నుండి శ్రీరాములు రెడ్డి, బాలాజమ్మ, కిరణ్ కుమార్ ఆచారి, గిరియాదవ్, రాజగోపాల్ రెడ్డి, ఉమ,పెరుమాళ్ రెడ్డి, సాయి,ఉదయకుమార్ చేరారు.

పనపాకం పంచాయతీలో ...

చంద్రగిరి, ఏప్రిల్ 14: చంద్రగిరి మండలంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. పనపాకం పంచాయతీ, పాకాలవారిపల్లెకు చెందిన వైసీపీ కార్యకర్తలు శేఖర్, యుగంధర్, శివ, చంద్రబాబు, భరత్, అమాసవారిపల్లెకు చెందిన మధు, రాము, కుమార్, వేణు, సుధాకర్‌లు టీడీపీ మండలాధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి నాని టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని నాని హామీ ఇచ్చారు. కార్యకర్తలు మాట్లాడుతూ చంద్రగిరి వైసీపీలో కుటుంబ పాలన, ఆధిపత్య ధోరణి ఎక్కువైందన్నారు. టీడీపీ నాయకులు ఏవీ రమణమూర్తి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సురేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, నగరం రమేష్, మేడసాని కుమార్, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన ఎంపీటీసీ పి.కస్తూరి తదితరులు

ఊరూవాడా అంబేడ్కర్‌కు నివాళులు



చంద్రగిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశం

చంద్రగిరి/భాకరాపేట/రామచంద్రాపురం/తిరుపతి రూరల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం చంద్రగిరిలోని టవర్ క్లాక్ వద్ద ఆయన విగ్రహానికి దళితులు, రాజకీయ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని విద్యాశాఖ కార్యాలయం, ఎస్సీ హాస్టళ్లు, ఎంపీడీవో కార్యాలయం, చిగరాల దళితవాడలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద ఎంఈవో సత్యనారాయణ నివాళులు అర్పించారు. రామచంద్రాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీరాణి బానుకుమార్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి పూలమాలలు వేశారు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అవిలాలలో సర్పంచ్ వెంకటరమణ నేతృత్వంలో అన్నదానం నిర్వహించారు. సప్తగిరికాలనీ టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో టీడీపీ సీనియర్ నాయకులు తాతయ్యాయేసపాదం, బాలకృష్ణారెడ్డి, నెల్లూరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోని అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం

- తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్



తిరుపతి మున్సిపల్ పార్కులో ఓటర్లకు వరప్రసాద్ వందనం

తిరుపతి (ఉపాధ్యాయనగర్)/ శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14: వైసీపీలోని అరాచక శక్తులపై త్వరలో ఏర్పడే బీజేపీ, టీడీపీ, జనసేన ప్రభుత్వంలో ఉక్కుపాదం మోపుతామని తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం తిరుపతి మున్సిపల్ పార్కులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కు అభివృద్ధికి తాను ఎంపీగా ఉన్న సమయంలో ఎంతో కృషి చేశానన్నారు. మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానంటూ హామీ ఇచ్చారు. అక్కడినుంచి కేటీరోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రచారం చేశారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశానికి దిక్సూచి వంటిదని కొనియాడారు. అక్కడ కొద్దిసేపు స్థానికులతో మాట్లాడారు. ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి, నేతలు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



బొజ్జల సుధీర్‌రెడ్డి, వెలగపల్లి ఆలింగనం

బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని వరప్రసాద్ అభ్యర్థించారు. ఆదివారం శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, అందుకే బీజేపీలో చేరారన్నారు. బొజ్జల మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, కోశాధికారి కంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి: సర్వేపల్లిలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార సభలోనూ వెలగలపల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుపతి సెంట్రల్, ఏప్రిల్ 14 : ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రైల్వే ఉద్యోగులు విధులు నిర్వహించాలని, అదే సమయంలో ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ సేఫ్టీ అధికారి చంద్రశేఖర్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ ఆదేశించారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రైళ్ల పార్కింగ్, షంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్త పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి, స్టేషన్ మాస్టర్లు, పాయింట్‌మెన్స్, విద్యుత్, మెకానికల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బలిజలు సత్తా చాటాలి

టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి ● ఆత్మీయ సమావేశంలో వంగవీటి రాధా పిలుపు



టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: రానున్న ఎన్నికల్లో బలిజల సత్తా చాటి.. సంఖ్యాబలం చూపాలని రాష్ట్ర కాపుసంఘం నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. చిత్తూరులోని ఆర్‌ఎల్ నాయుడు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ బలిజల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజలకు వైసీపీ సరైన గుర్తింపు ఇవ్వలేదని.. బలిజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేసింది శూన్యమని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడానికే కులాల వారీగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి కనీసం రూపాయి కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. వైసీపీలో కేవలం సీఎం జగన్ సామాజిక వర్గానికే గుర్తింపు ఉందన్నారు. టీడీపీ కూటమితోనే కాపు సామాజిక వర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరు లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తమను గెలిపిస్తే నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరా రు. అనంతరం టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిని పోల్చు తూ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

వైసీపీ ఇంతే!

కుప్పంలో కోడ్ ఉల్లంఘన



కుప్పం, ఏప్రిల్ 14: కుప్పంలో వైసీపీ నేతలు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. జగన్‌రెడ్డిపై గులకరాయి దాడికి నిరసనగా ధర్నా చేశారు. అంతకుముందు ర్యాలీగా వచ్చారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ధర్నా చేయడంపై టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఫోన్ ద్వారా ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. వీడియోలు, ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించారు. రిటర్నింగ్ అధికారిని వివరణ కోరగా.. కోడ్ అమల్లో ఉన్నప్పుడు ధర్నాలు, నిరసనలు చేసేందుకు అనుమతి లేదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైసీపీ ధర్నా చేయడం కోడ్ ఉల్లంఘించడమేన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి, వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

'బల్ల'లో సర్పంచి సహా 32మందిపై కేసులు

రామకుప్పం: రామకుప్పం మండలం బల్ల గ్రామంలో ఎన్నికల నియామవళిని ఉల్లఘించి చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేసిన సర్పంచు విజయ్‌థామస్, అతని తండ్రి, రెస్కో డైరెక్టరు థామస్, అనుచరుడు రవికుమార్‌తో పాటు 32 మందిపై ఆదివారం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ ఆందోళన వీడియోలను గ్రామస్థులు కలెక్టరుకు పంపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ నోడల్ అధికారి ఈశ్వరన్నను కలెక్టరు ఆదేశించారు. ఈశ్వరన్న తన బృందంతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ఆయన ఫిర్యాదు మమేరకు 32మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

వాణియంబాడి సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్

- కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే రైళ్లు ఆలస్యం

కుప్పం, ఏప్రిల్ 14: తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి సమీపంలో గూడ్స్ రైలు ఆదివారం రాత్రి పట్టాలు తప్పింది. దీంత కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే పలు రైళ్లు ఆలస్యమయ్యాయి. తిరుపతినుంచి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ వాణియంబాడిలో ఆగిపోయింది. అలాగే చెన్నై నుంచి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్ రైలును వలతూర్ రైల్వే స్టేషన్‌లో అధికారులు ఆపేశారు. దీంతో కుప్పం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు రాత్రి వేళ తీవ్ర అవస్థలు పడ్డారు. రైళ్లకోసం ఎదురుతెన్నులు చూస్తూ స్టేషన్‌లోనే కాలం గడిపారు. కాగా రైల్వే అధికారులు వాణియంబాడి వద్ద పట్టాలు తప్పిన రైలుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.



పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు - కుప్పం స్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఐఐటీలో 5కే రన్

- ఏపీ వ్యాప్తంగా 400 మంది విద్యార్థులు
- జెండా ఊపి ప్రారంభించిన డైరెక్టర్



5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, ఏప్రిల్ 14: తిరుపతి ఐఐటీలో 5కే రన్ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పేడు వద్ద ఉన్న ఐఐటీ శాశ్వత ప్రాంగణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యాసంస్థల నుంచి 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ- ఫిట్‌నెస్ ఫ్యూజన్ 5కే క్యాంపస్ రన్ అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఎస్వీ విశ్వవిద్యాలయం, స్విమ్స్, మహిళ విశ్వవిద్యాలయం(తిరుపతి), అపోలో విశ్వవిద్యాలయం (చిత్తూరు) వంటి ప్రతిష్టాత్మక సంస్థలు, నాయుడుపేట, నెల్లూరు, కడప నుంచి అనేక ఇతర సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరించాయి. ఎలక్ట్రో స్టీల్, అమర ఆస్పత్రి, నారాయణాద్రి ఆస్పత్రి, హీలియోస్ ఆస్పత్రి, స్పోర్ట్స్ బొనాంజా, స్పోర్ట్స్ వరల్డ్ వంటి స్పాన్సర్లు ఈ రన్‌కు మద్దతు ఇచ్చాయి. ఐదుగురు విజేతలకు పతకాలు, ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు బహుమతులు అందజేశారు. సర్టిఫికెట్లను అందించడంతో పాటు సత్కరించారు.

వైసీపీ నుంచి టీడీపీలో వలసలు



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో పులివర్తి నాని

తిరుచానూరు, ఏప్రిల్ 14: చంద్రగిరి నియోజకవర్గంలో ఆర్సీపురం, తిరుపతి రూరల్ మండలాల నుంచి చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో ఆదివారం పలువురు వైసీపీ నేతలు,కార్యకర్తలు టీడీపీలో చేరారు. రఘునాథ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆర్‌సీపురం మండలం గణేష్‌పురానికి చెందిన ప్రవీణ్, నవీన్, బాబ్జీతో పాటు పలువురు చేరారు. తిరుపతి రూరల్ మండలంలోని మంగళం,తిరుమలనగర్, వేదాంతపురం పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు చేరారు. మంగళం వార్డు మెంబర్లు బుజ్జమ్మ, మోహనమ్మ, తేజోవతితో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు చేరారు. ప్రజారాజ్యం పార్టీ మాజీ మహిళా నాయకురాలు దీపతో పాటు వందమంది టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ పులివర్తి నానిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ప్రకటించింది. ఇక, శనివారం 82,139 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,849 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డిని తొలగించాల్సిందే

ఎన్డీఏ కూటమి నేతలు


మాట్లాడుతున్న ఎన్డీఏ కూటమి నేతలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 14 : టీటీడీ చైర్మన్ పదవి నుంచి భూమన కరుణాకరరెడ్డిని తక్షణమే తొలగించాలని ఎన్డీఏ నేతలు గొల్ల నరసింహయాదవ్(టీడీపీ), హరిప్రసాద్(జనసేన), సామంచి శ్రీనివాస్(బీజేపీ) డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ కేవలం భూమనను తొలగించాలని మాత్రమే ఈసీకి ఫిర్యాదు చేశామని, టీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన ఇంటిస్థలాలు, జీతాల పెంపును రద్దు చేయాలని కోరలేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ఎన్డీఏ కట్టుబడి ఉందన్నారు. కరుణాకరరెడ్డి అవాస్తవాలను ప్రచారం చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు చైర్మన్ పదవిని వాడుకుంటున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీలో జరిగిన ప్రతి అక్రమాన్నీ వెలికితీస్తామని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యం బలపడాల్సిన అవసరముంది

హర్యానా గవర్నర్


బండారు దత్తాత్రేయ

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యం బలపడాల్సిన అవసరముందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆయన ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. దేశ సమైక్యతలో, రెండు రాష్ట్రాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు. ధర్మప్రచారం, సనాతన ధర్మ పరిరక్షణకు టీటీడీ మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

వెంకన్న సేవలో వంటలక్క


ఆలయం ముందు ప్రేమి విశ్వనాథ్

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : 'కార్తీకదీపం' సీరియల్‌తో వంటలక్కగా పేరుపొందిన బుల్లితెర నటి ప్రేమి విశ్వనాథ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆమెను చూసేందుకు పలువురు మహిళలు ఆసక్తి చూపారు. దగ్గరికెళ్లి పలకరించి ఫొటోలు దిగారు.

ఘాట్ రోడ్డులో అదుపు తప్పిన కారు


ప్రమాదానికి గురైన కారు

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఆదివారం ఓ కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకుని ఉదయం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 9వ మలుపు వద్ద కారు అదుపుతప్పి కుడివైపునున్న క్రాష్ బారియర్‌ను ఢీకొట్టింది. ముందు భాగం ధ్వంసమైంది. కాగా, కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ముందు టైర్ పగిలిపోవడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

తిరుమలేశుడి సేవలో శ్రీలంక గవర్నర్


సెంథిల్ తొండమాన్

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక గవర్నర్ సెంథిల్ తొండమాన్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం సెంథిల్‌కు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఉప విద్యాశాఖాధికారిగా బాలాజి


బాలాజీ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 14: తిరుపతి ఉప విద్యాశాఖాధికారిగా ప్రస్తుత తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖాధికారి కె. బాలాజీని నియమించారు. ఆ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి డిప్యూటీ డీఈవో స్థానం కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. పరిపాలనాపరంగా సమస్యలు తలెత్తుతుండడంతో సీనియారిటీ ప్రకారం ఫ్యాకల్టీ అడ్వైజరీ కమిటీ సూచన మేరకు బాలాజీని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కూలర్లు, సరుకుల వితరణ




తిరుపతి(విద్య), ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు వృద్ధాశ్రమానికి రూ.లక్ష విలువజేసే కూలర్లు, సరుకులను అందజేశారు. బైరాగిపట్టెడలోని మాతృభాష అనాథాశ్రమానికి, భవానీనగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమానికి అందించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికొండ సునీల్, తిరుపతి మాడ్యూల్ నాయకులు శ్రీరాములునాయక్, బాబు, టీటీడీ యూనియన్ నాయకులు డాక్టర్ మేడికొండ ప్రసాదరావు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి


ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న బీఎస్ఎఫ్ బలగాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 14 : ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తిరుపతి వెస్ట్ సీఐ జయనాయక్ కోరారు. తిరుపతి వెస్ట్, రూరల్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బీఎస్ఎఫ్ బలగాలతో కలసి పోలీసులు ఆయుధాలు చేతపట్టుకుని నగర వీధుల్లో మార్చ్ నిర్వహించారు. త్యాగరాజనగర్, సరోజినీదేవి రోడ్డు, గిరిపురం, పట్నూల వీధి, జ్యోతి థియేటర్ సర్కిల్, ఐఎస్ మహల్ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. రూరల్ పరిధిలో టెలిఫోన్‌కాలనీ, గరుడనగర్, ఓటేరు, శ్రీనివాసపురం ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేశారు.

17న శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 17వ తేదీన శ్రీరామనవమి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం శ్రీరాముడు హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. 18వ తేదీ శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తారు. శ్రీరామనవమి సందర్భంగా 17వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామ లక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహన సేవ ఉంటుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈ కారణంగా సహస్ర దీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. 18న రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
అధికార పార్టీ నాయకుల అండదండలు



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 14 : అధికారంలోకి వస్తే దశల వారీగా మద్య నిషేధం చేస్తామని గొప్పలు చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చేతులెత్తేశారు. జిల్లాలోని 253 ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. దీనికితోడు జిల్లావ్యాప్తంగా అధికార పార్టీ నేతల అండదండలతో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. కూల్‌డ్రింక్ దుకాణాలు, బడ్డీ కొట్లు, టిఫిన్ షాపుల్లో ఏర్పాటు చేసి, విక్రయాలు సాగిస్తున్నారు. చంద్రగిరి, ఎర్రావారిపాళ్యం, భాకరాపేట, నగరి, జంబాడ, విజయపురం, ఊరందూరు, శ్రీకాళహస్తి రూరల్, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు ఎక్కువగా ఉన్నాయి. తమిళనాడు సరిహద్దు గ్రామాల్లో లెక్కకు మించి ఉన్నట్లు తెలుస్తోంది. వీటి వెనుక అధికార పార్టీ నేతలు ఉండడంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నాలుగు సంవత్సరాలుగా నామమాత్రపు దాడులకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్‌ల ద్వారా మద్యం తరలించి అధిక రేట్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. సెబ్ అధికారులకు భారీగానే ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

194 కేసులు నమోదు చేశాం : ఎస్ఈబీ అదనపు ఎస్పీ రాజేంద్ర

జిల్లాలో బెల్టు షాపులకు తావులేదని, అలా ఉన్నట్లు తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ అదనపు ఎస్పీ రాజేంద్ర తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత 194 కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశామని చెప్పారు.

హర్యానా మద్యం సరఫరాలో సూత్రధారులపై ఆరా

తిరుపతిలో గురువారం పట్టుబడిన హర్యానా మద్యం సరఫరా వెనుక సూత్రధారులపై తిరుపతి అర్బన్ సెబ్ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఏ మార్గాల్లో తీసుకొస్తున్నారు.. తిరుపతికి తీసుకొచ్చి విక్రయించే వారు ఎవరు అనే వివరాలు రాబడుతున్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న బండారు దత్తాత్రేయ - నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ - చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ - డిస్కం కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పూలమాల వేసి, నివాళులర్పించారు. నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో..

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూ మెయిన్ గేట్ వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పుష్పాంజలి ఘటించారు. అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో అంబేడ్కర్ జయంతి సభ నిర్వహించారు. వీసీ శ్రీకాంత్ రెడ్డి నివాళి అర్పించారు. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ పరిపాలనా భవనంలో అంబేడ్కర్ జయంతి సభ నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ భారతి పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో..

తిరుపతి(వైద్యం) : రుయాస్పత్రి, స్విమ్స్, బర్డ్, ఎస్వీ వైద్య కళాశాలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను నిర్వహించారు. రుయాస్పత్రి ముందు ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు అన్నదానం చేశారు. స్విమ్స్‌లో డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఆధ్వర్యంలో, ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో..

తిరుపతి(నేరవిభాగం): ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

డిస్కం కార్యాలయంలో..

తిరుపతి(ఆటోనగర్): సదరన్ డిస్కం కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతిని ఘనంగా నిర్వహించారు. డిస్కం డైరెక్టర్ సుబ్బరాజు, ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిస్కం కార్యదర్శి టి.జయరామ్ కార్యాలయ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్పొరేట్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. కాంట్రాక్టు కార్మికులకు అసోసియన్ వారు దుస్తులు పంపిణీ చేశారు. పాస్ స్వచ్ఛంద సేవా సంస్థలో పిల్లలకు భోజనం, నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు లక్ష్మీనరసయ్య, గురవయ్య, అయూబ్‌ఖాన్, పి.మురళి, అధికారులు ఆదిశేషయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, సురేంద్ర, వెంకటపతిరాజు, నాయకులు ఐ.సుబ్రమణ్యం, శంకరయ్య, జనార్దన్, అంజనప్ప, బాబు పాల్గొన్నారు.

● తిరుచానూరు రోడ్డులోని ఈఈ, శ్రీనివాస కల్యాణమండపం వెనుకనున్న ఎస్ఈ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి, ఎస్ఏవో శ్రీనివాసులు, ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, ఏఏవోలు, జేఏఏవోలు పాల్గొన్నారు.

● తిరుపతి రైల్వేస్టేషన్ ఉద్యోగులు ఎస్ఎంఆర్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి, అసోషియన్ నాయకులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు వేస్తే రౌడీషీట్ తెరుస్తారు!

కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హెచ్చరిక



తిరుపతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లు వేస్తే ఎన్నికల నిబంధనల మేరకు రౌడీషీట్ తెరుస్తారని తిరుపతి జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం నగరంలోని 33, 34, 45 డివిజన్ల పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతిలో అధికార పార్టీ నేతలు దొంగ ఓట్లు, కమీషన్ డబ్బులతో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నించే వారు కచ్చితంగా శిక్షార్హులవుతారంటూ హెచ్చరించారు. 2021లో జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో 34 వేల దొంగ ఓట్లను వైసీపీ చేర్పించిందని ఆరోపించారు. దొంగ ఓట్లను తొలగించాలని ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరి ఓటు వారు వేసుకోవడంలో ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. అయితే దొంగ ఓట్లు వేయడం తగదన్నారు. తిరుపతిలో ప్రశాంతత కోసం కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



స్థానిక నేతలు రాజేంద్ర, యువరాజ్, ప్రసాద్, శ్రీనివాస్, లోకనాథం యాదవ్, సుజాతతో పాటు టీడీపీ ముఖ్యనేతలు నరసింహ యాదవ్, ఊకా విజయ్‌కుమార్, సంజయ్, కోడూరు బాలసుబ్రమణ్యం, పులుగోరు మురళి, దంపూరు భాస్కర్, జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, ఆకేపాటి సుభాషిణి, రాజారెడ్డి, ఆనంద్, బత్తిన మధుబాబు, బీజేపీ నేతలు పొనగంటి భాస్కర్, వరప్రసాద్, వరప్రసాద్, సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారుతి హాస్పిటల్ వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జగదీష్

తిరుపతి(వైద్యం),ఏప్రిల్ 14: తిరుపతి లీలామహల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన ఉన్న శ్రీ మారుతి హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జగదీష్, ప్రొఫెసర్ గణపతిభట్, మారుతి హాస్పిటల్ చైర్మన్ రామకృష్ణనాయుడు జ్యోతి ప్రజ్వళన చేశారు. డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ గుండెకు సంబంధించి మేజర్ ఆపరేషన్లకు చెన్నై, హైదరాబాదు వంటి మహానగరాలకు వెళ్లే అవసరం లేకుండా తిరుపతిలోనే అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థోకు సంబంధించి ఏడాదిలో 100కు పైగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేసిన ఏకైక హాస్పిటల్‌గా మారుతి నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హాస్పిటల్ సిబ్బందికి జ్ఞాపిక బహూకరించారు.

సురేంద్రకు అంబేడ్కర్ సాహిత్య పురస్కారం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 14: అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని సత్యసాయి జిల్లా రచయితల సంఘం, దళిత పరిరక్షణ సమితి సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీల్లో ప్రథమ బహుమతి విజేత, ఉపాధ్యాయుడు, కవి సురేంద్ర రొద్ద ను అంబేడ్కర్ సాహిత్య పురస్కారంతో సత్కరించారు. అనంతపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మెలవాయి గోవిందరెడ్డి, రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, దళిత పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతులు పురస్కారం అందజేసి, రూ.మూడువేల నగదు, శాలువతో సత్కరించారు.

ఓటమి భయంతోనే వైసీపీ 2.0డ్రామా : టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 14: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజాదరణ తగ్గడంతో వైసీపీ 2.0 డ్రామాకు తెరలేపిందని టీడీపీ నేతలు నరసింహయాదవ్, రవినాయుడు, కంకణాల రజనీకాంత్ విమర్శించారు. ఆదివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో కోడికత్తి ఘటన తరహాలోనే ఇప్పుడు క్యాటర్‌బాల్ డ్రామాకు పూనుకుందని ఆరోపించారు. అది కూడా వికటిస్తే వైఎస్ కుటుంబంలో మరో హత్య చేయడానికి వైసీపీ సిద్ధమైందని ఎద్దేవా చేశారు. జగన్‌పై దాడి డ్రామాను కూటమి పార్టీలపై రుద్దడం దుర్మార్గమన్నారు. చేతనైతే దాడి చేసిన వారిని పట్టుకోవాలే తప్పా చంద్రబాబుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సీఎంకే రక్షణ కల్పించలేని సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను ఈసీ తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా తమ అగ్రనేతల ఫ్లెక్సీలపై కరుణాకరరెడ్డి చెప్పులతో దాడి చేయించడాన్ని ఖండించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా కూటమిదే విజయమని దీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాజా, గోపి, గణేష్, సురేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు హౌస్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో చింతా



తిరుపతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని పార్లమెంటు హౌస్‌లో ఆదివారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో తిరుపతి మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ పాల్గొన్నారు. పార్లమెంటు హౌస్‌లో భారత ప్రభుత్వం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్, ప్రధాని నరేంద్ర మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొనగా చింతా మోహన్ కూడా హాజరయ్యారు. ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం, నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా సేవలందించిన మహనీయుడంటూ అంబేడ్కర్‌ను కొనియాడారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలిసి నివాళులర్పిస్తున్న టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్‌కుమార్

నల్లారి కిషోర్‌ను కలసిన తిరుపతి టీడీపీ నేతలు



తిరుపతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పీలేరు నుంచీ అసెంబ్లీకి పోటీ చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని ఆదివారం ఆ పార్టీ తిరుపతి నేతలు కలిశారు. కలికిరి మండలం నగరిపల్లిలోని నల్లారి స్వగృహంలో ఆయన్ను కలిసి శ్రీవారి ఆశీస్సులతో ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ చిత్రపటాన్ని అందజేశారు. వీరిలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, జగ్గా, సుబ్రమణ్యం నాయుడు, ధర్మారెడ్డి తదితరులున్నారు.

కాంగ్రెస్ టికెట్ నాకే ఇవ్వాలి : అన్నపూర్ణమ్మ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14: శ్రీకాళహస్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధక్షురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని బేరివారి మండపం వద్ద పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బహిరంగ సభ వద్ద ఆదివారం ఆమె ప్లకార్డులతో నిరసన ప్రదర్శించారు.

కాంగ్రెస్‌తోనే శ్రీకాళహస్తి అభివృద్ధి



మాట్లాడుతున్న రాజేష్ నాయుడు

శ్రీకాళహస్తి/ తొట్టంబేడు, ఏప్రిల్ 14: కాంగ్రెస్ పార్టీ తోనే శ్రీకాళహస్తి అభివృద్ధి సాధ్యం అని ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రాజేష్ నాయుడు అన్నారు. శ్రీకాళహస్తిలోని బేరివారి మండపం వద్ద ఆదివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ప్రస్తుతం ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తనను గెలిపిస్తే శ్రీకాళహస్తిని అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు.

ఆరు సవర్ల బంగారు చోరీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 14: మండల కేంద్రంలోని సచి వాలయ సమీపంలో కాపురం ఉంటున్న చెంచురెడ్డి ఇంట్లో ఆరు సవర్ల బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి కథనం మేరకు.. శనివారం రాత్రి చెంచురెడ్డి, ఆయన భార్య ఇంటి బయట నిద్ర పోయారు. తలుపులకు తాళం వేయడం మరిచిపోయారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి డ్రసింగ్ టేబుల్‌లోని 48 గ్రాముల బంగారంతో పాటు బొట్లు, గుండ్లను చోరీ చేశారు. ఉదయం లేచాక చోరీ విషయం గుర్తించారు. ఎస్‌ఐ వెంకటనరసింహ, ఏఎస్‌ఐ రమేష్‌బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడికత్తికి పార్ట్ -2 గులకరాయి దాడి : ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 14: విజయవాడలో సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కోడికత్తికి పార్ట్-2 అని సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆది మూలం పేర్కొన్నారు. సత్యవేడులో ఆదివారం స్థానిక వీకేఎస్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంపై జరిగిన దాడి టీడీపీ పనే అని వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. 2019 ఎన్నికలకు ముందు విశాఖలో జరిగిన కోడికత్తి దాడి డ్రామాకు, విజయవాడలో జరిగిన గులకరాయి దాడికి పెద్దతేడా ఏమీ లేదన్నారు. ఘటన జరిగిన ఐదు నిమిషాల్లోనే మాజీ మంత్రి పేర్ని నాని, మంత్రి అంబటి లైవ్‌లోకి వచ్చి ఇది టీడీపీ చేయించిందని చెప్పడం చూస్తే ఇదంతా ముందస్తు ప్రణాళికలో భాగమే అని తెలుస్తోందన్నారు. ఇలా ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వైసీపీని ఇంటికి పంపించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్, ఎస్సీసెల్ మోర్చా అధ్యక్షుడు మునిక్రిష్ణయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య, నాయకులు పరమశివం, రోశయ్య, సుబ్రమణ్యం రాజు, గోవిందస్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



రాజులకండ్రిగలో అన్నదానం చేస్తున్న బీఎస్పీ నాయకుడు పరశురామ్

కేవీబీపురం, ఏప్రిల్ 14: మండలంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి అన్నిపార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో అంబే డ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రాజులకండ్రిగ బీఎస్పీ నాయకుడు పరశురామ్ ఆధ్వర్యంలో ఏడు గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు.

తారకరామనగర్: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని తారకరామనగర్‌లో మాలమహాసేన నాయకులు అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 14: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీకి నక్కలమిట్టకు చెందిన మణికంఠ(39) వడదెబ్బతో శనివారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మణికంఠ కుటుంబానికి ఇరుగుళం జయశంకర్‌రెడ్డి ఆదివారం రూ.7వేలు ఆర్థికసాయం చేశారు.

ఆశీర్వదించండి..అండగా ఉంటా: కాంగ్రెస్ అభ్యర్థి బాబు

సత్యవేడు, ఏప్రిల్ 14: స్థానికుడైన తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటానని, ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ అభ్యర్థి బాలగురవం బాబు కోరారు. సత్యవేడులో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి ఆదిమూలాన్ని కలవాలంటే పుత్తూరు వెళ్లాలని, వైసీపీ అభ్యర్థి రాజేష్‌ను గెలిపిస్తే పెద్దిరెడ్డి ఇంటికి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. తాను నియోజకవర్గంలో ఎన్నో భూపోరాటాల్లో పాల్గొని పేదలకు అండగా నిలబడ్డానని తెలిపారు. వైసీపీ నాయకులు ఇసుక, గ్రావెల్ తదితర సహజ వనరులను యథేచ్ఛగా దోచుకుని నియోజకవర్గాన్ని పీల్చిపిప్పి చేశారని ఆరోపించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి దాసరి జనార్దన్, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం, శ్రీరామచంద్రారెడ్డి, ఎంటెక్ బాబు, చెల్లదురై. భాస్కర్ పాల్గొన్నారు.

షర్మిల సభకు బత్తెయ్యనాయుడు డుమ్మా

శ్రీకాళహస్తి/ తొట్టంబేడు, ఏప్రిల్ 14: పీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు షర్మిల సభకు డుమ్మాకొట్టారు. శ్రీకాళహస్తిలో సుమారు నాలుగు దశాబ్దాల నుంచి డాక్టర్ బత్తెయ్య నాయుడు కాంగ్రెస్ నాయకులుగా కొనసాగారు. ఇటీవల టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన డాక్టర్ రాజేష్ నాయుడును శాసనసభ అభ్యర్థిగా ప్రకటించారు. దీనిపై డాక్టర్ బత్తెయ్య నాయుడు కొద్దిరోజులుగా విభేదిస్తూ విలేకరుల సమావేశాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి టికెట్ తనకే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో అధిష్టానం నుంచి స్పందన రాకపోవడంతో షర్మిల సభకు హాజరు కాలేదని తెలిసింది.

జగన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించండి: కురుగొండ్ల

దక్కిలి, ఏప్రిల్ 14: రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్న సీఎం జగన్ రెడ్డిని ప్రజలు ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపు నిచ్చారు. ఆదివారం దక్కిలి మండలం దేవునివెల్లంపల్లి గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరడంతో వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్ సీఎం అయ్యాక వ్యవస్థలన్నీ నాశనం చేశారని ఆరోపించారు. తన కుమార్తె లక్ష్మీసాయిప్రియను వెంకటగిరి ఎమ్మెల్యేగా, తిరుపతి ఎంపీగా వరప్రసాద్‌ని గెలిపించాలని కోరారు. నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, దక్కిలి భాస్కరరెడ్డి, పెంచలరెడ్డి, పీపీ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో జనం ఉసురుతీస్తున్న జగన్

- సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం

దొరవారిసత్రం, ఏప్రిల్ 14: డబ్బే సంపాదన లక్ష్యంగా.. కల్తీ మద్యంతో జనం ఉసురును సీఎం జగన్ తీస్తున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దొరవారిసత్రం మండలం నెల్లూరుపల్లి పంచాయతీలో ఆదివారం టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దాదాపు 45 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఉయ్యాల ప్రవీణ్, 786 రఫీ, జక్కరయ్య, మనోహర్ రెడ్డి, వేమసాని శోభన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

జగన్ డ్రామాలను ప్రజలు నమ్మరు: నెలవల

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 14: మొన్న కోడి కత్తికేసు, నిన్న రాయితో దాడి వంటి జగన్ డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీతో కలసి ఆదివారం మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికలు సమీపిస్తున్నాయంటే ఏదో ఒక డ్రామాతో ప్రజలను మోసం చేసేందుకు ఎత్తుగడలు వేస్తున్నాడని మండిపడ్డారు. వీరివెంట టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, విజయకుమార్‌నాయుడు, శోభన్‌నాయుడు తదితరులున్నారు.

'ఎన్‌ఐఏతో విచారణ చేపట్టాలి'

గూడూరు అర్బన్: సీఎం జగన్‌పై జరిగిన దాడిపై ఎన్ఐఏతో విచారణ చేపట్టి నిజాలు నిగ్గుతేల్చాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇది కూడా కోడికత్తి డ్రామాలాంటి జగన్నాటకమేనన్నారు. ఎన్ని డ్రామాలు వేసినా.. రానున్నది చంద్రన్న పాలననేనని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

కారు, బైక్ ఢీ: విద్యార్థికి తీవ్రగాయాలు

కోట, ఏప్రిల్ 14: కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వెంకన్నపాళెంకు చెందిన నివాస్ బైక్‌లో ఆదివారం కోటవైపు వెళ్తున్నాడు. కోట నుంచి ఓ కారు వాకాడు వైపు వెళ్తూ వీరారెడ్డిసత్రం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నివాస్‌కు తీవ్రగాయాలవగా, కుటుంబీకులు చికిత్స నిమిత్తం చెన్నైకి తరలించారు.

ఐఐటీలో 5కే రన్

- ఏపీ వ్యాప్తంగా 400 మంది విద్యార్థులు
- జెండా ఊపి ప్రారంభించిన డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ



5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, ఏప్రిల్ 14: తిరుపతి ఐఐటీలో 5కే రన్ కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పేడు వద్ద ఉన్న ఐఐటీ శాశ్వత ప్రాంగణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఐఐటీ అధికారులు

ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యాసంస్థల నుంచి 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ-ఫిట్‌నెస్ ఫ్యూజన్ 5కే క్యాంపస్ రన్ అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఎస్వీ విశ్వవిద్యాలయం, స్విమ్స్, మహిళ విశ్వవిద్యాలయం(తిరుపతి), అపోలో విశ్వవిద్యాలయం (చిత్తూరు) వంటి ప్రతిష్టాత్మక సంస్థలు, నాయుడుపేట, నెల్లూరు, కడప నుంచి అనేక ఇతర సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరించాయి. ఎలక్ట్రోస్టీల్, అమరఆస్పత్రి, నారాయణాద్రి ఆస్పత్రి, హీలియోస్‌ఆస్పత్రి, స్పోర్ట్స్ బొనాంజా, స్పోర్ట్స్ వరల్డ్ వంటి స్పాన్సర్లు ఈరన్‌కు మద్దతిచ్చాయి. ఐదుగురు విజేతలకు పతకాలు, ఒక్కొక్కరికి రూ.5వేల బహుమతులు అందజేశారు. సర్టిఫికెట్లను ప్రదానం చేసి, సత్కరించారు.

అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని గద్దె దించాలి : పాశిం

గూడూరు, ఏప్రిల్ 14: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మండలంలోని కొమ్మనేటూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వెంకటేశ్వర్లురాజు, సురేష్‌రెడ్డి, అమరేంద్ర, గుండాల లీలావతి, పిట్టి నాగరాజు, అంకయ్య, పొండయ్య, వెంకటరమణమ్మ, సుబ్బరాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ →



వైసీపీలోని అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం

- తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్



తిరుపతి మున్సిపల్ పార్కులో ఓటర్లకు వరప్రసాద్ వందనం

తిరుపతి (ఉపాధ్యాయనగర్)/ శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14: వైసీపీలోని అరాచక శక్తులపై త్వరలో ఏర్పడే బీజేపీ, టీడీపీ, జనసేన ప్రభుత్వంలో ఉక్కుపాదం మోపుతామని తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం తిరుపతి మున్సిపల్ పార్కులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్కు అభివృద్ధికి తాను ఎంపీగా ఉన్న సమయంలో ఎంతో కృషి చేశానన్నారు. మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానంటూ హామీ ఇచ్చారు. అక్కడినుంచి కేటీరోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రచారం చేశారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశానికి దిక్సూచి వంటిదని కొనియాడారు. అక్కడ కొద్దిసేపు స్థానికులతో మాట్లాడారు. ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి కొల్లూరి లక్ష్మి, నేతలు యుగంధర్, దామోదర్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని వరప్రసాద్ అభ్యర్థించారు. ఆదివారం శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీలో తాను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని, అందుకే బీజేపీలో చేరారన్నారు. బొజ్జల మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, కోశాధికారి కంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బొజ్జల సుధీర్‌రెడ్డితో వెలగపల్లి ఆలింగనం

సర్వేపల్లి: సర్వేపల్లిలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార సభలోనూ వెలగలపల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో శ్రీలంక గవర్నర్



సెంథిల్ తొండమాన్

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక గవర్నర్ సెంథిల్ తొండమాన్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం సెంథిల్‌కు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

తిరుమలలో 17న శ్రీరామనవమి ఆస్థానం

తిరుమల ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 17వ తేదీన శ్రీరామనవమి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం శ్రీరాముడు హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. 18వ తేదీ శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తారు. శ్రీరామనవమి సందర్భంగా 17వ తేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహన సేవ ఉంటుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈ కారణంగా సహస్ర దీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. 18న రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామపట్టాభిషేకం నిర్వహిస్తారు.

సత్యకుమార్‌కు సన్మానం



నాయుడుపేట, ఏప్రిల్ 14: బీజేపీ జాతీయ కార్యదర్శి ధర్మవరం బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సత్యకుమార్‌ను ఆదివారం నాయుడుపేట బీజేపీ నాయకులు కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీసెల్ మాజీ కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్, జిల్లా కార్యదర్శి ఆశా చెంచుకృష్ణయ్య, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, ఆరూరు సుధాకర్, యనమల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఉప విద్యాశాఖాధికారిగా బాలాజి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 14: తిరుపతి ఉప విద్యాశాఖాధికారిగా ప్రస్తుత తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖాధికారి కె. బాలాజీని నియమించారు. ఆ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి డిప్యూటీ డీఈవో స్థానం కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. పరిపాలనాపరంగా సమస్యలు తలెత్తుతుండడంతో సీనియారిటీ ప్రకారం ఫ్యాకల్టీ అడ్వైజరీ కమిటీ సూచన మేరకు బాలాజీని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తిరుమల ఘాట్‌లో అదుపు తప్పిన కారు



తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తిరుమల మొదటి ఘాట్‌లో ఆదివారం ఓ కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకుని ఉదయం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 9వ మలుపు వద్ద కారు అదుపుతప్పి కుడివైపునున్న క్రాష్ బారియర్‌ను ఢీకొట్టింది. ముందు భాగం ధ్వంసమైంది. కాగా, కారులోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ముందు టైర్ పగిలిపోవడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

పుత్తూరు వార్తలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

నారాయణవనం, ఏప్రిల్ 14: బొప్పరాజపాలెం పంచాయితీ, వెంకటకృష్ణాపాలెం, కళింమిట్ట పంచాయతీ నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. వీరిలో.. బొప్పరాజపాలెం సర్పంచ్ రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ వెంకటేష్‌తోపాటు సుమారు వందమంది ఉన్నారు. ఆదిమూలం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, రాష్ట్రాభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యమని ప్రజలు గ్రహించారని చెప్పారు.

ముగిసిన విశ్వనాథుల స్వామి గురుపూజోత్సవం



నారాయణవనం, ఏప్రిల్ 14: అరణ్యం కండ్రిగ పంచాయతీ కైలాసకోనలోని కంచి బ్రహ్మజ్ఞాని విశ్వనాథుల స్వామి గురుపూజోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దీనదయాల్ నాయుడు, కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు సెల్వి, ఉప కార్యదర్శి గోపీనాథం, కోశాధికారి రఘపతిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు - చంద్రప్రభ వాహనంపై స్వామి, అమ్మవారు

నారాయణవనం, ఏప్రిల్ 14: సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయమైన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం ఉదయం మేషలగ్నంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరుడు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో కళాకారుల కోలాటాలు, అన్నమయ్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంకీర్తనలు అలరించాయి. ఆలయ పర్యవేక్షకుడు నాగరాజు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, అర్చకులు రమేష్ గురుకుల్, రమణిగురుకుల్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా చక్రస్నానం

నారాయణవనం, ఏప్రిల్ 14: పాలమంగళం ఉత్తరంలోని భద్రావతి సమేత భావనారుషిస్వామి ఉత్సవాలు చక్రస్నానంతో ముగిశాయి. ఆదివారం అరుణానదిలో వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ చక్రస్నాన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి కోడికత్తి డ్రామాలు పనిచేయవు: భానుప్రకాష్



అయనంబాకంలో భానుప్రకాష్‌కి సన్మానం - పుత్తూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన భాను

నగరి ఏప్రిల్14: జగన్‌రెడ్డి కోడికత్తి డ్రామాలు ఇక పనిచేయవని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మండల పరిధిలోని అయనంబాకం, దామరపాకంలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. కోడికత్తి డ్రామాలాగా రాళ్లదాడిని వాడుకోవడానికి జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. వైసీపీని ఇంటికి తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తంనాయుడు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి

వడమాలపేట: టీడీపీని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మండల పార్టీ ప్రధాన కార్యదర్శి హేమావతి చెప్పారు. ఆదివారం పూడి పంచాయితీలో మీకోసం మీభాను కార్యక్రమంలో ఇంటింటా కరపత్రాలు అందజేశారు. నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. ధనంజయులు నాయుడు, వెంకటయ్య, వేణు, శ్రీనివాసులు, యుగంధర్, నారాయణ, వెంకటేష్, కన్నయ్య, హేమంత్, ధనశేఖర్, ధర్మతేజ, పురుషోత్తం, హేమాద్రి, ఉదయ్, బబ్లు, జనసేన నాయకులు మునిశేఖర్, శేషాద్రి, కుమార్, చెంచు, సునీల్ పాల్గొన్నారు.

పుత్తూరు అర్బన్: కేఎన్ రోడ్డు సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా టీడీపీ పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఆదిమూలం - పోతుగుంట విజయబాబు

నారాయణవనం, ఏప్రిల్ 14: మండల కేంద్రంలోని కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జడ్పీటీసీ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తిరువట్యం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. దిగువకనకంపాలెం, ఇప్పతాంగేల్, బ్రాహ్మణతాంగేల్, పాలమంగళం, భీముని చెరువు, కళింమిట్టలోనూ వేడుకలు జరిగాయి.

వడమాలపేట: అంబేడ్కర్ జయంతి సందర్భంగా వడమాలపేటలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగరి టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ కేక్‌కట్ చేశారు. నాయకులు జయంత్, దిలీప్, లోనాథం, మస్తాన్, రాజశేఖర్, వినోద్, వెంకయ్య, మునిబాబు, డేవిడ్, వెంకటేష్, నాగరాజు, మునస్వామి, భాను ప్రసాద్, మోహన్, ప్రభాకర్, మురళి, వెంకటేష్, రమేష్, వెంకటస్వామి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పుత్తూరు అర్బన్: కేఎన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి, నివాళి అర్పించారు. అలాగే బీజేపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మండల అధ్యక్షుడు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ధర్మరాజుల గుడి వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పుత్తూరు డివిజన్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ప్రకటించింది. ఇక, శనివారం 82,139 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,849 మంది తలనీలాలు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం



వడమాలపేట, ఏప్రిల్ 14: భవానీ శంకర్ దేవాలయంలో మహాశివుడి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా ఆదివారం మహా రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు శివ, సాయి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. భక్తులకు కల్లూరుకు చెందిన సుధాకర్ రెడ్డి, ప్రమీల దంపతులు అన్నదానం చేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అశోక్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న చిన్నారులు

ఏర్పేడు, ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏర్పేడులో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు పిల్లపాళెం వాసు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అంబే డ్కర్ చిత్రపటాన్ని ఊరేగిం చారు. ఏర్పేడు అశోక్‌నగర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి చిన్నారులు, పెనగడంలో, వికృతమాల, నచ్చనేరి, పరమాలపల్లి, రాజులపాళెంలో అంబే డ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు అంజలి ఘటించారు. అంబేడ్కర్ స్టార్ కృష్ణ, ఏకాంబరం, తిరుమలయ్య, సుందర బాబు, జనార్ధన్, డాక్టర్ మునెయ్య, ప్రసాద్, గాలి రవి, గురవయ్య, గురవమ్మ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 14: మండలంలోని ఆలత్తూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఐ వెంకటనరసింహ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇసుకు రీచ్‌లకు అనుమతులు లేవన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

తొట్టంబేడు, ఏప్రిల్ 14: శ్రీకాళహస్తి మండలంలోని దొడ్లమిట్ట వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శేఖర్(26)ను అరెస్టు చేసి నట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ తెలిపారు. అతడి వద్ద 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

అగ్ని ప్రమాదాల నిర్మూలనపై అవగాహన పెరగాలి

శ్రీకాళహస్తి: అగ్ని ప్రమాదాల నిర్మూలనపై అందరిలో అవగాహన పెరగాలని ఎంజీఎం గ్రూప్ సంస్థల అధినేత మయూర్ అన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. అగ్నిమాపక అధికారి నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి , ఆత్మీయ సమావేశంలో కూటమి శ్రేణులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 14: రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్న ఆశయంతోనే కూట మి ఏర్పాటు జరిగిందని నేతలు అన్నారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ, బీజేపీ, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గురవారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, బీజేపీ రాష్ట్ర కార్య దర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, కండ్రిగ ఉమ, జనసేన నాయకులు కొట్టేసాయి, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు రోజురోజుకూ పెరుగుతున్నాయని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండ లంలోని చేమూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయ కులు సంజీవరెడ్డి తన 30 మంది అనుచరులతో టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తిలోని టీడీపీ కార్యాలయం లో బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి పసుపు కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లా డుతూ వైసీపీ అరాచకాలను, స్థానిక ఎమెల్యే దౌర్జన్యాలను భరించలేకనే టీడీపీలో చేరుతున్నామన్నా రు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి గాలి చలపతి నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, రావిళ్ల మునిరాజనాయుడు, మిన్నల రవి పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వైసీపీ నాయకులు చెంచురెడ్డి ద్వారా 40 మంది వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్ర మంలో జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి మండలంలోని మాధవమాల, వేలవేడు, ఎర్రగుడిపాడు గ్రామాలలోని వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చంచయ్యనాయుడి ఆధ్వర్యంలో వెంకటేష్, పోలయ్య, సిద్ధయ్య, బాలాజీ, రాఘవేంద్ర, గిరి, వీరా స్వామి, సుబ్రమణ్యం, సుమారు 300 మంది టీడీపీలో చేరారు. ఊరందూరులోని స్వగృహం వద్ద సుధీర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● శ్రీకాళహస్తి పట్టణం1, 2 వార్డులకు చెందిన 40 మంది టీడీపీ తీర్థం స్వీకరించారు.

● ఆర్టీసీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి సుధీర్ రెడ్డి నివాళులర్పించారు.

వైసీపీ భ్రమలో పడి మోసపోకండి

ఏర్పేడు: వైసీపీ భ్రమలో పడి మోసపోవద్దని బొజ్జల రిషితారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. అంజిమేడు పంచాయతీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో నాయకులు ధనంజయలునాయుడు, శివశంకర్‌రెడ్డి, కన్నలి మోహన్‌రెడ్డి, శివాజీరెడ్డి, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, పొన్నారావు, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంజిమేడులో ప్రచారంచేస్తున్న బొజ్జల రిషితారెడ్డి

అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

సత్యవేడు, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆదివారం సత్యవేడులో అంబేడ్కర్ జయంతిని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. ● తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులు, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రసూన, ఎంజేపీబీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు అంజలి ఘటించారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరులో టీడీపీ శ్రేణులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిమూలం పూలమాల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, దళిత నాయకులు రజని, నీరువాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురంలో దళిత నాయకులు, టీడీపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులయాదవ్, పార్తీబన్, పరశురాం శిల్పి, మురళి, జాన్సన్, సునీల్, ఎండీ.కుమార్, రాజశేఖర్‌యాదవ్, బీజేపీ నాయకులు సత్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

Before the Hon'ble Deputy Registrar of Chits :: Nellore.
(Application for reference of a Dispute to Arbitration)
Dispute No.206/2023
M/s.Shriram Chits (India) Pvt.Ltd., formerly Known as Shriram Chits Pvt Ltd., Nellore-II Branch, Rep. by its Manager (Legal) cum GPA Holder ... Disputant
Vs
1.Mallapati Padma and 5 Others ...Opponents
To,
Notice
Opp-4: Beemaneni Prabhu S/o. Kesavulu R/o. D.No.2-181, Ram Nagar Street, Satyavedu, Chittoor Dist and doing business in the name of DSC Motors (Private Travels), C/o: No.19, Nemalur, Madharapakam, Gummidipoondi, Tiruvallur Dist, Tamilnadu.
పై పేర్కొనబడిన డిస్ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పై తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం తే.26-04-2024దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 11.00 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై అభ్యంతరాలు తెలుపుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వి.జయరామారావు., B.A., B.L.,
డిస్ప్యూటెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు

పేదలకు అన్నదానం


బుచ్చినాయుడుకండ్రిగలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 14: బడుగు, బహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పలువురు కీర్తించారు. మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహ సీల్దారు ఉదయభారతి, ఆర్ఐ వేణుగోపాల్, డీటీ శాంతి అంబేడ్కర్‌కు అంజలి ఘటించారు. దళిత ప్రజావేదిక అధ్యక్షుడు శంకర్, వరదయ్య పాళెంలో సర్పంచులు వేణు, కిషోర్ తదితరులు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చి నాయుడుకండ్రిగలో ఎమ్మార్పీ ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాఘవయ్య ఆధ్వ ర్యంలో అంబేడ్కర్‌కు అంజలి ఘటిం చారు. కనమనంబేడులో గ్రామ స్తులు, దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు యువశ్రీ మురళి, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, విజయభాస్కర్, ధర్మయ్య, దశకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

Before the Hon'ble Deputy Registrar of Chits :: Nellore.
(Application for reference of a Dispute to Arbitration)
Dispute No.203/2023
M/s.Shriram Chits (India) Pvt.Ltd., formerly Known as Shriram Chits Pvt Ltd., Nellore-II Branch, Rep. by its Manager (Legal) cum GPA Holder ... Disputant
Vs
1.Beemaneni Swathi and 5 Others ...Opponents
To,
Notice
Opp-1: Beemaneni Swathi W/o. Prabhu, R/o. D.No.2-181, Ram Nagar Street, Satyavedu, Chittoor District.
Opp-6: Beemaneni Prabhu S/o. Kesavulu R/o. D.No.2-181, Ram Nagar Street, Satyavedu, Chittoor Dist and doing business in the name of DSC Motors (Private Travels), C/o: No.19, Nemalur, Madharapakam, Gummidipoondi, Tiruvallur Dist, Tamilnadu.
పై పేర్కొనబడిన డిస్ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పై తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం తే.26-04-2024దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 11.00 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై అభ్యంతరాలు తెలుపుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వి.జయరామారావు., B.A., B.L.,
డిస్ప్యూటెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు

హెచ్చరిక
ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా, తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మండలం, కైలాసగిరి కాలనీ, ఇంటినెం. 7-193లో నివాసముండు మా కక్షిదారు కె. మురళీక్రిష్ణ గారి భార్య కె. పార్వతి తరపున హెచ్చరించడం ఏమనగా, మా కక్షిదారుకి అవసరనిమిత్తమై సదరు కైలాసగిరి కాలనీలో నివాసముండు వి.శాంతమ్మ, W/o వి. ధనంజయులు మరికొంత మంది దగ్గర ఆర్థిక లావాదేవీలు జరిపి ఆ సమయంలో మా కక్షిదారుపై ఒత్తిడికి గురిచేసి, మా కక్షిదారు మరియు ఎస్.రమేష్ రాజు అనువారి దగ్గర ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు పూచీకత్తుగా తీసుకొని అవి వారి స్వాధీనంలో వుంచుకొని మా కక్షిదారు బాకీ పడిన మొత్తం చెల్లించినా కూడా పూచీకత్తుగా తీసుకున్న ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు తిరిగి ఇవ్వకుండా మా కక్షిదారు మరియు ఎస్. రమేష్ రాజు, మానసికంగా హింసిస్తూ, దౌర్జన్యానికి దిగి, అయాచిత లబ్ధి పొందాలని వారు, వారి తరపున ఇతరుల ద్వారా దావాలు, మరియు ఫిర్యాదులు చేస్తామని మా కక్షిదారును ఆవేదనకు గురిచేస్తూ, బెదిరిస్తున్నారు. ఈ విషయమై పై కనిన వి.శాంతమ్మ మరియు ఇతరులపై 4-4-2024వ తేదీన వారికి వ్యక్తిగతంగా లీగల్ నోటీసులు కూడా పంపియున్నాము. కాగా వి. శాంతమ్మ అనువారు మా కక్షిదారుని, ఆమె మైనర్ కుమార్తెను మరియు ఎస్.రమేష్ రాజును అసభ్యకరమైన మాటలతో తిడుతూ, కొంతమంది ఆకతాయిలతో వ్యక్తిగత దూషణలకు గురిచేస్తూ.. దాడికి యత్నిస్తూ, ఫోన్ల ద్వారా వేధిస్తున్నారు. కావున వి. శాంతమ్మ మరియు ఇతరుల యొక్క మాటలు విని మా కక్షిదారుపై ఎలాంటి తప్పుడు, మోసపూరిత ఫిర్యాదులు గాని, వ్యక్తిగత దూషణలను చేసి, దాడులకు యత్నించి, ఈ హెచ్చరికను మీరి ఎవరైన ప్రవర్తించిన యెడల అట్టివారిపై తీసుకును సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.
శ్రీ సి.హెచ్.యం.యస్.రాజు
శ్రీ పేరందూరు గజేంద్ర, శ్రీమతి చింతా సుజాత
న్యాయవాదులు, తిరుపతి